# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 25 | శుక్రవారం | 21-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:25 | Friday | 21-8-2026 | Pages:08 | Cost:2/-



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక

తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ


94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## రాష్ట్రాల జల వివాదాలకు చర్చలే శరణ్యం

- ఏళ్ల తరబడి వివాదాలు కొనసాగిస్తే ఎవరికీ ప్రయోజనం ఉండదు
- న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు ఈ సమస్యలను పరిష్కరించలేవు
- సెప్టెంబర్‌లో 4 రాష్ట్రాల సీఎంలతో ఢిల్లీలో భేటీ నిర్వహిస్తాం
- సదరన్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా



హైదరాబాద్:దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి దేశ ప్రగతికి మూలాధారమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. జలవివాదాలను న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు పరిష్కరించలేవని.. పరస్పర సంప్రదింపులతోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకోవడం తప్పు కాదని.. అయితే ఆ నెపంతో నీటిని సముద్రంలోకి వదిలేస్తూ ఏళ్ల తరబడి వివాదాలు కొనసాగిస్తే ఏ ఒక్కరికీ ప్రయోజనం ఉండదన్నారు. అందుకే తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక మధ్య నెలకొన్న జల వివాదాలపై చర్చించడానికి సెప్టెంబర్ తొలి వారంలో ఢిల్లీలో ఆయా రాష్ట్రాల సీఎంలతో సమావేశం నిర్వహిస్తామని అమిత్ షా ప్రకటించారు. తమిళనాడులోని మహాబలిపురంలో గురువారం జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ భేటీలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క (సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లడంతో), తమిళనాడు సీఎం సి.జోసెఫ్ విజయ్, ఏపీ సీఎం చంద్రబాబు, కర్ణాటక సీఎం డి.కె.శివకుమార్, కేరళ వి.డి.సతీశన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- మిగతా 2వ పేజీలో



## మూడు రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్

- అమరావతి, బెంగళూరు, చెన్నైలను కుప్పం మీదుగా అనుసంధానం
- గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- విభజన సమస్యలను త్వరగా తేల్చాలని కేంద్రానికి విజ్ఞప్తి
- దక్షిణ మండల మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక సూచనలు

దక్షిణ భారతదేశంలోని మూడు కీలక రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులను కలుపుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. మూడు రాష్ట్రాల రాజధానులు, ప్రధాన పారిశ్రామిక కేంద్రాలైన అమరావతి, బెంగళూరు, చెన్నైలను అనుసంధానించే ఈ హై-స్పీడ్ రైలు ప్రాజెక్టును చేపట్టాలని ఆయన సూచించారు. ముఖ్యంగా తన నియోజకవర్గమైన కుప్పం మీదుగా ఈ కారిడార్ వెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. గురువారం మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో చంద్రబాబు ఈ కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మూడు నగరాలు ఇప్పటికే పారిశ్రామికంగా, సాంకేతికంగా గణనీయమైన అభివృద్ధి సాధించాయని, వాటి మధ్య హై-స్పీడ్ రైలు మార్గం ఏర్పాటు చేస్తే రవాణా వ్యవస్థ బలోపేతమై ఆర్థికాభివృద్ధి

- మిగతా 2వ పేజీలో



## హైదరాబాద్ యాక్సిడెంట్ కేసులో జనసేన ఎంపీ కుమారుడు

- నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో యువతి దుర్మరణం
- ఆగస్టు 16న ఇనార్బిట్ మాల్ వద్ద జరిగిన ఘటన
- ఆస్టన్ మార్టిన్ కారుతో ఢీకొట్టినట్లు గుర్తింపు
- భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు

హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం కేసులో కీలక పురోగతి లభించింది. ఈ ప్రమాదానికి కారణమైన కారును జనసేన రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కుమారుడు లింగమనేని సంజూష్ నడిపినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

2లో

## పరీక్షలే రాయకుండాద ఎవరికీ మేం ఉద్యోగాలివ్వలేదు

- కోవిడ్ కారణంగానే డిజిటల్ మూల్యాంకనం
- అయినా డిజిటల్ మూల్యాంకనాన్ని పరిగణనలోకి తీసుకోలేదు
- డిజిటల్ మూల్యాంకనాన్ని హైకోర్టు తప్పుబట్టలేదు
- హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే మొత్తం ప్రక్రియ
- సీసీటీవీల పర్యవేక్షణలో మూడు చోట్ల మూల్యాంకనం
- పేపర్లు ట్యాంపర్ అవలేదని తేల్చిన సీఎఫ్ఎస్ఎల్ నివేదిక
- బాబు హయాంలో సీసీటీవీలు లేవు.. ఒకటే ఇంటర్వ్యూబోర్డు
- మా హయాంలో ఏపీపీఎస్సీలో విప్లవాత్మక సంస్కరణలు

డీఎస్సీ నియామకాల్లో అక్రమాలకు, కుంభకోణానికి పాల్పడి, ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయిన తన కొడుకును కాపాడుకోవాలన్న ఆరాటంతో సీఎం చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా గ్రూప్--1 నియామకాలపై పచ్చి అబద్ధాలు వల్లెవేశారని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు వల్లెవేసిన అబద్ధాలను సాక్ష్యాధారాలతో కడిగిపారేశారు. గురువారం తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో జరిగిన విలేకరుల సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ గ్రూప్--1పై చంద్రబాబు ప్రభుత్వమే వేసిన సిట్ ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా నిబంధనలకు అనుగుణంగా పరీక్షల నిర్వహణ, ఇంటరర్వ్యూలు జరిగాయని హైకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిన తర్వాత కూడా అసెంబ్లీ వేదికగా అబద్ధాలు చెప్పారన్నారు.

- మిగతా 2వ పేజీలో



### నేడు హైదరాబాద్‌కు వైఎస్ జగన్

అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి జలవిహార్ గ్రాండ్ లాన్స్‌లో జరిగే సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహ వేడుకకు హాజరవుతారు.



2లో

## జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదు

- మాజీ సీఎం జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదంటూ ఎద్దేవా
- గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ వేయకపోవడానికి ఇదే కారణమన్న లోకేశ్
- అసెంబ్లీ చర్చ నుంచి జగన్ పారిపోతున్నారని ఆరోపణ
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లోకేశ్ పోస్ట్

## నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

- క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ
- రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత అనుచిత వ్యాఖ్యలు
- కొండా సురేఖకు నోటీసులు జారీ చేసిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- కమిటీ ఎదుట హాజరై వివరణ ఇచ్చిన సురేఖ



2లో

## సీఎం నివాసం ఉండే ప్రాంతాన్ని కూడా నిషేధిత జాబితాలోకి తెచ్చారు

- 22ఏ నిషేధిత జాబితా ఆధారంగా దోపిడీ జరుగుతోందన్న లక్ష్మణ్
- ఈ అంశంలో రాహుల్ గాంధీ, ఖర్గే జోక్యం చేసుకోవాలని విన్నపం
- కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి తెచ్చారని మండిపాటు

తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా ఆధారంగా భారీ భూదందాలు, దోపిడీ జరుగుతున్నాయని ఆరోపిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 22ఏ భూముల విషయంలో తప్పులు జరిగాయని ఒప్పుకుని మంత్రి క్షమాపణలు చెప్పడంపై లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం అధికారులపై నెపం తోసి తప్పించుకోలేరని,

- మిగతా 2వ పేజీలో



## స్థానిక పోరుకు జనసేన సై..

- ఆ వ్యూహం గత ఎన్నికలకే పరిమితమన్న పవన్ కల్యాణ్
- 2స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని జనసేనకు పవన్ పిలుపు
- విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు,
- సీనియర్లతో ప్రత్యేక కమిటీ
- సార్వత్రిక ఎన్నికలకు భిన్నంగా స్థానికాల్లో మెరుగైన స్థాయిలో పోటీ
- గత ప్రభుత్వ హయాంలో పోరాడిన శ్రేణుల స్ఫూర్తిని గౌరవిస్తామని హామీ

2లో

## నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

రేవంత్ రెడ్డి, పరకాల నియోజకవర్గంపై తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసులకు స్పందిస్తూ, హైదరాబాద్‌లోని కమిటీ ఎదుట హాజరై ఈ మేరకు తన వివరణను సమర్పించారు. తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తం చేసిన రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరిని బాధ్యులను చేయడం సముచితం కాదని, అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఈ సందర్భంగా సురేఖ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, పీసీసీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణమైన గౌరవం, విశ్వాసం ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తన ప్రమేయం ఏమాత్రం లేదని... ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు.

## హైదరాబాద్ యాక్సిడెంట్ కేసులో జనసేన ఎంపీ కుమారుడు

(మొదటి పేజీ తరువాయి)

గత నెల ఆగస్టు 16వ తేదీ రాత్రి ఇనార్బిట్ మాల్ ఎదురుగా రోడ్డు దాటుతున్న భారతి ముఖి (26) అనే యువతిని అతివేగంగా వచ్చిన ఆస్టన్ మార్టిన్ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలు ఓ లైఫ్‌స్టైల్ స్టోర్‌లో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తోంది. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుండి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీటీవీ ఫుటేజ్, వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ (టీజీ-09-జీ-0666) ఆధారంగా లోతైన దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా, ప్రమాద సమయంలో కారును సంజూష్ నడుపుతున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అజాగ్రత్తగా వాహనాన్ని నడిపి మరణానికి కారణమైనందుకు అతడిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతోంది.

## జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదు

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీల మధ్య గల వ్యత్యాసం కూడా తెలియదని, ఆ అజ్ఞానం వల్లే గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు జగన్ పాత ప్రెస్ మీట్ వీడియోను లోకేశ్ గురువారం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు."ఏపీపీఎస్సీ అంటే ఏమిటో తెలియదు, డీఎస్సీ అంటే ఏమిటో తెలియదు. రెండూ ఒకటే అని జగన్ భావిస్తున్నారు" అంటూ లోకేశ్ తన పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని నియామక వ్యవస్థలపై జగన్‌కు ఉన్న అవగాహన లోపం వల్లే గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. ఉద్యోగ నియామకాలపై అసెంబ్లీలో జరిగే చర్చ నుంచి కూడా జగన్ పారిపోతున్నారని ఆక్షేపించారు. ఏపీపీఎస్సీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్), డీఎస్సీ (జిల్లా ఎంపిక కమిటీ)... ఈ రెండు వేర్వేరు వ్యవస్థలనే కనీస పరిజ్ఞానం కూడా జగన్‌కు లేదని లోకేశ్ విమర్శించారు.

## సీఎం నివాసం ఉండే ప్రాంతాన్ని కూడా నిషేధిత జాబితాలోకి తెచ్చారు

ఎవరి ఆదేశాల మేరకు లక్షలాది మంది ప్రజల భూములను నిషేధిత జాబితాలో పెట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 22ఏ భూముల కేటాయింపులు, తొలగింపుల్లో వేల కోట్ల రూపాయల దందాలు జరుగుతున్నాయని, దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. ంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం 22ఏ జాబితాపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారని లక్ష్మణ్ గుర్తుచేశారు. ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి నివాసం ఉండే ప్రాంతాన్ని కూడా ఈ నిషేధిత జాబితాలోకి చేర్చారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కోటి ఎకరాలను ఈ పరిధిలోకి తెచ్చిందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల ఆస్తులను కాపాడటంలో విఫలమైందని, కాంగ్రెస్ పాలన రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారిందని మండిపడ్డారు.

## రాష్ట్రాల జల వివాదాలకు చర్చలే శరణ్యం

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2013లో కృష్ణా జలాల పంపిణీపై తీర్పును ప్రకటించగా, ఇంకా ఆ తీర్పును నోటిఫై చేయలేదని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. 10 నిమిషాల్లో జరగాల్సిన పని 13 ఏళ్లు గడిచినా పరిష్కారం కాలేదని, ట్రిబ్యునల్ తీర్పును నొటిఫై చేయకపోయినా..ఆ తీర్పులో జరిపిన కేటాయింపుల ఆధారంగా కృష్ణా జలాలను వాడుకోవడానికి అనుమతించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నీటి కేటాయింపులు లేకుండా తెలంగాణ నిర్మిస్తున్న పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకోవాలని ఆయన కోరగా చర్చలతో ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని అమిత్‌షా సూచించారు. పోలవరం ప్రాజెక్టు నుంచే గోదావరి--కావేరి అనుసంధానం చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు కోరారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు వివాదాన్ని పరిష్కరించుకోవాలని కేంద్ర మంత్రి అమిత్ షా సూచించగా అన్ని ప్రాజెక్టులపై చర్చించి ఏకాభిప్రాయానికి వద్దామని చంద్రబాబు సూచించారు. పాలమూరు--రంగారెడ్డి, తుమ్మిడిహెట్టి, గోదావరి--కావేరి అనుసంధానం ప్రాజెక్టులతోపాటు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేసే అంశంపై సెప్టెంబర్‌లో ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర సీఎంలతో సమావేశం నిర్వహిస్తామని ఈ సందర్భంగా అమిత్ షా ప్రకటించారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తులు, అప్పుల విభజన, ఇతర పెండింగ్ సమస్యలను కేంద్ర హోంశాఖ సంప్రదింపులతో త్వరలోనే పరిష్కరించుకోవడానికి రెండు రాష్ట్రాల ప్రతినిధులు సమ్మతించారు.

# పరీక్షలే రాయకుండా ఎవరికీ మేం ఉద్యోగాలివ్వలేదు

(మొదటి పేజీ తరువాయి)

'నిజానికి నాడు చంద్రబాబు హయాంలోనే గ్రూప్--1 పరీక్షల ప్రిలిమ్స్ జరిగాయి. మేము వచ్చాక మెయిన్స్ మాత్రమే నిర్వహించాం. ఎక్కడా తప్పు చేయలేదు. అక్రమాలు చోటు చేసుకోలేదు. డీఎస్సీ కుంభకోణం నుంచి కొడుకును కాపాడుకోవడం కోసమే నాలుగేళ్లుగా పనిచేస్తున్న 163 మంది ఉద్యోగుల జీవితాలను అతలాకుతలం చేయడానికి కూడా చంద్రబాబు వెనుకాడటం లేదు' అని జగన్ విమర్శించారు. ఏపీపీఎస్సీపై చంద్రబాబు అబద్ధాలను అంశాలవారీగా ఆధారాలతో సహా జగన్ ఖండించారు. "చంద్రబాబు తన కొడుకును కాపాడుకోవడానికి ఏ విధంగా బురద జల్లుతున్నాడో ఇప్పుడు చూద్దాం. చంద్రబాబు మరింత దిగజారిపోయి తన ప్రభుత్వమే 2018లో ప్రకటించిన ఏపీపీఎస్సీ గ్రూప్--1 పోస్టుల భర్తీపై తప్పుడు ఆరోపణలు చేయడం మొదలు పెట్టారు. 163 మంది ఉన్నత ఉద్యోగుల జీవితాలను అతలాకుతలం చేయాలని చంద్రబాబు టార్గెట్ చేశాడు. బాబు ప్రభుత్వ హయాంలోనే ప్రిలిమ్స్ అయిపోయాయి. మేము చేసింది కేవలం మెయిన్స్ నిర్వహించడమే. ఇక ఎక్కడ నుంచి వస్తాయి స్వార్థ ప్రయోజనాలు. అప్పటి ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఇప్పటి చంద్రబాబు ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో లాగా పేపర్ లీకేజీ జరగలేదు. ఇప్పటి డీఎస్సీలో లాగా ప్రశ్నపత్రాల తయారీ విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎవరికీ ఉద్యోగాలు రాలేదు. ఎవరికీ అనుకూలంగా ప్రత్యేక జీవోలు తీసుకురాలేదు. మా ప్రభుత్వంలో పరీక్షలే రాయకుండా ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వలేదు. ఉద్యోగాలు అమ్ముకున్నట్లుగా, బేరసారాలు చేస్తున్నట్లుగా, డబ్బులు ఇచ్చినట్లుగా ఎవరివీ ఆడియోలు, వీడియోలు ఎలాంటి ఆధారాలు మా ప్రభుత్వ హయాంలో రాలేదు. మా ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలకు ఇప్పుడు జరుగుతున్న డీఎస్సీ స్కాంకు మధ్య తేడా ఇదే. కేవలం కొడుకును కాపాడుకోవడం కోసం చంద్రబాబు ఆక్రోశం, ఆరాటం బయటకు వస్తోంది.

### చంద్రబాబు వేసిన సిట్టే క్లీన్ చిట్ ఇచ్చింది

ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం చేసిన ఆరోపణలపై వాస్తవాల్లోకి వెళ్దాం.. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 2025 ఏప్రిల్‌లో ఒక సిట్ వేశారు. ఫలితాల వెల్లడిలో ఏ తప్పూ జరగలేదని నవంబర్14, 2025న చంద్రబాబు ప్రభుత్వం హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఇది ఒకవైపు జరుగుతుండగానే ఈ సిట్ ఇలా హైకోర్టులో అఫిడవిట్లు వేస్తుండటంతో ఎలాగోలా ఇరికించాలన్న తాపత్రయంతో చంద్రబాబు ఫిబ్రవరి14, 2026న రెండో సిట్ వేశారు. బాబు కింద పనిచేసేవారే కదా ఆ సిట్‌లో ఉండేది. అధికారులను వాడుకోవడం చంద్రబాబుకు అలవాటే కదా.. నిజాలు ఎవరూ దాచిపెట్టలేరు. ఎప్పటికైనా బయటకు వస్తాయి. 2019 ఎన్నికలకు 76 రోజుల ముందు చంద్రబాబు నోటిపికేషన్ ఇచ్చారు. మా ప్రభుత్వం మే 30న రాక మునుపే మే 26, 2019 ప్రిలిమ్స్ ఎగ్జామ్స్ అయిపోయాయి. మేం వచ్చాక ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించి 2020 డిసెంబర్‌లో మెయిన్స్ నిర్వహించాం. బాబు హయాంలో నిర్వహించిన ప్రిలిమ్స్‌లో ఎంపికైన వారికి మెయిన్స్ నిర్వహిస్తే వారిపై బురద జల్లుతున్నారు. ఇంగిత జ్ఞానం ఉన్నవారు ఎవరైనా ఇలా చేస్తారా.

### హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే మొత్తం ప్రక్రియ

కోవిడ్ పరిస్థితులు తీవ్రంగా ఉన్న సమయం. అటువంటి సమయంలో పరీక్షల ఫలితాల వెల్లడి ఆలస్యం కాకూడదని అప్పటి అధికారులు డిజిటల్ ఎవాల్యుయేషన్‌కు వెళ్లాలని నిర్ణయించారు. అప్పటి కమిషన్‌లో మునుపటి ప్రభుత్వం చంద్రబాబు హయాంలో నియమించిన ఐదుగురు సభ్యులు కూడా ఆమోదం తెలిపారు. బోర్డులో ఉన్న 10మంది సభ్యుల్లో ఐదుగురు వాళ్ళే ఉన్నారు. డిజిటల్ ఎవాల్యుయేషన్ అంటే.. రాసిన పరీక్షల స్క్రిప్ట్స్‌ను స్కాన్‌చేసి పరీక్ష దిద్దే వారికి పంపిస్తారు. ఆన్‌లైన్‌లో వారు మార్కులు వేస్తారు. ఇది కూడా కోవిడ్ వల్ల.. అప్పటి పరిస్థితులు మీ అందరికీ గుర్తుండే ఉంటుంది. రక్త సంబంధీకులు చనిపోతే కూడా అంత్యక్రియలు నిర్వహించడానికి భయపడే పరిస్థితులు అవి. గ్రూప్స్ కింద ఒకే చోట తీసుకువచ్చి ఫిజికల్ ఎవాల్యుయేషన్ చేయలేని పరిస్థితి. అయినా కొంత మంది హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆదేశాల మేరకు డిజిటల్ ఎవాల్యుయేషన్ పరిగణనలోకి తీసుకోలేదు. ప్రక్రియ ముందుకు సాగలేదు. డిజిటల్ ఎవాల్యుయేషన్‌ను తప్పుపట్టలేమని, కానీ నోటిఫికేషన్‌లో ఈ విషయం పేర్కొనకపోవడం వల్ల తాము మాన్యువల్ ఎవాల్యుయేషన్ చేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు హైకోర్టు తీర్పులో స్పష్టంగా పేర్కొంది. హైకోర్టు చెప్పిన తర్వాత డిజిటల్ ఎవాల్యుయేషన్ అన్నది పరిగణనలోకి తీసుకోలేదు.

## స్థానిక పోరుకు జనసేన సై..

రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. ఈ ఎన్నికలే లక్ష్యంగా పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన వ్యూహానికి భిన్నంగా, క్షేత్రస్థాయి బలాబలాలకు అనుగుణంగా ఈ ఎన్నికల్లో జనసేన ప్రభావశీలమైన పోటీ ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం శాసనసభ ప్రాంగణంలోని తన కార్యాలయంలో జరిగిన జనసేన శాసనసభ పక్ష సమావేశంలో ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎన్నో దాడులు, బెదిరింపులు, ఒత్తిళ్లు ఎదురైనా ధైర్యంగా నిలబడిన జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని ఎప్పటికీ విస్మరించబోమని అన్నారు. వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఈ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. "నామినేషన్ వేయలేని పరిస్థితులు సృష్టించినా, అప్పటి పాలకులను ఎదిరించి పోటీలో నిలిచిన మన శ్రేణుల త్యాగం విలువైనది. వారి స్ఫూర్తికి తగిన గౌరవం దక్కేలా ఈసారి జనసేన నిలబడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, అప్పటి దాష్టీక పాలనను అంతం చేయాలనే లక్ష్యంతోనే జనసేన కేవలం 21 స్థానాలకు పరిమితమై పోటీ చేసిందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఆ వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే పరిమితమని, స్థానిక ఎన్నికల్లో ప్రాంతాలవారీగా రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు ఉంటాయని వివరించారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకే పరిమితం కాకుండా, తమ పరిధిలోని ఇతర ప్రాంతాల్లో జనసేన బలాబలాలను అంచనా వేయాలని ఆదేశించారు. పోటీకి అనువైన స్థానాలను గుర్తించి, పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. రాబోయే ఎన్నికల కార్యాచరణ, విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది సభ్యులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ కమిటీ పనిచేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కొందరు ఎమ్మెల్యేలు, కొన్ని నియోజకవర్గాల్లో మిత్రపక్షాల నేతల వైఖరి వల్ల శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోందని, కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్, ఈ అంశాలు తన దృష్టిలో ఉన్నాయని, పార్టీ శ్రేణుల మనోభావాలను తప్పక గౌరవిస్తామని హామీ ఇచ్చారు. వారికి రాజకీయంగా అండగా నిలుస్తూ, మెరుగైన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.



## మూడు రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్.

మరింత వేగవంతం అవుతుందని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని, ఇది దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమావేశంలో, దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చంద్రబాబు మరో ముఖ్యమైన సూచన చేశారు. దక్షిణాదిలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం వంటి వాటిని.. ఉత్తర భారతదేశంలోని వారణాసి, అయోధ్య, చార్‌ధామ్ వంటి ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటక రంగానికి కొత్త ఊపునిస్తుందని తెలిపారు. 2047 నాటికి భారత్‌ను 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలన్న జాతీయ లక్ష్యంలో దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా 31 శాతంగా ఉందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్లు, తమిళనాడు 2.6 ట్రిలియన్ డాలర్లు, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా ఎదిగే లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని, తద్వారా దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ఆయన వివరించారు. ఈ లక్ష్యాల సాధనకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

# రైల్వే ప్రాజెక్టు పనుల్లో జాప్యం వద్దు

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో చేపడుతున్న మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అభివృద్ధి పనుల్లో జరుగుతున్న జాప్యంపై పార్లమెంటు సభ్యులు దక్షిణ మధ్య రైల్వే అధికారులను నిలదీశారు. పనుల్లో వేగం పెంచి వీలైనంత తొందరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గురువారం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్(కొంతభాగం) మహారాష్ట్ర(కొంతభాగం)లకు చెందిన పార్లమెంటు సభ్యులతో జోన్ జీఎం సంజీవ్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులు రైల్‌నిలయంలో భేటీ నిర్వహించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు మొత్తం 16 మంది ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నగరానికి తూర్పు వైపు చర్లపల్లి టెరి?మనల్‌ను నిర్మించినట్లుగానే పశ్చిమ దిశలో ఈదుల నాగులపల్లి వద్ద టెరి?మనల్‌ను నిర్మించాలని ఎంపీ రఘునందన్‌రావు కోరారు. కోవిడ్ సమయంలో నిలిచిపోయిన పలు రైళ్లను ఇప్పటికీ పూర్తిస్థాయిలో పునరుద్ధరించలేదని, వాటన్నింటినీ వెంటనే తిరిగి ప్రారంభించాలని ఖమ్మం ఎంపీ రఘురామ్‌రెడ్డి తెలిపారు. భద్రాచలానికి నేరుగా రైల్వే కనెక్టివిటీ కల్పించాలని, పాండురంగాపురం నుంచి భద్రాచలానికి రైల్వే లింక్ ఇవ్వాలని, కొత్తగూడెంను ప్రత్యేక రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కోరారు. కేంద్రప్రభుత్వం



ఎన్ని రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేసినా, రాష్ట్రప్రభుత్వం సకాలంలో భూమిని సేకరించి అందివ్వకుంటే ఎలాంటి ఫలితం ఉండదని, అన్ని రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్రప్రభుత్వం వేగంగా భూసేకరణ చేసి సహకరించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల తెలిపారు. మల్కాజిగిరిలో ఉత్తర భారతీయులు ఎక్కువగా ఉన్నందున, వారి సొంత ప్రాంతాలకు మరిన్ని రైళ్లు మంజూరు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రయోజనకరమైన 'ఇజ్జత్ పాస్'పథకాన్ని రద్దు చేయడం ఏమాత్రం సహేతుకం కాదని ఎంపీ బలరామ్‌నాయక్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్దపల్లి నియోజకవర్గానికి రూ.వేయి కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరు చేయించుకున్నామని, వీటికి సంబంధించి పలు ప్రాంతాల్లో భూసేకరణ అంశం కలెక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. తెలంగాణలో రూ. 2వేల కోట్లకు పైగా వ్యయంతో 40 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నామని, రూ.24,210 కోట్ల వ్యయంతో 1,481 కిలోమీటర్ల మేర కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని జీఎం శ్రీవాస్తవ తెలిపారు.

# వృద్ధులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలి





- సాయి యాదాద్రి సేవాశ్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

**తొలివెలుగు, చౌటుప్పల్ :** వృద్ధులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. చౌటుప్పల్ మండలం పెద్దకొండూర్ గ్రామ పరిధిలో ప్రభుత్వ అనుబంధంతో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయి యాదాద్రి సేవాశ్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఆశ్రమంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆశ్రమంలో ఎంతమంది వృద్ధులు ఉంటున్నారు, వారికి అందుతున్న వసతులు, ప్రతిరోజూ కల్పిస్తున్న భోజన సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. వృద్ధుల ఆరోగ్యం, మానసిక ఉల్లాసానికి ఆశ్రమ నిర్వాహకులు చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ అభినందించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయించడంతో పాటు క్యారమ్స్, ఇతర ఆటలు ఆడించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వృద్ధుల ఆరోగ్యంతో పాటు వారి మానసిక ఆనందానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అప్పుడప్పుడు వారిని విహారయాత్రలు, పర్యటనలకు తీసుకెళ్లాలని సూచించారు. ఇలాంటి పర్యటనలు వృద్ధులకు మానసిక ఉల్లాసంతో పాటు ఆత్మసంతృప్తిని కలిగిస్తాయని తెలిపారు. వృద్ధుల పట్ల ఆప్యాయత, ఆదరణ చూపిస్తూ కుటుంబ సభ్యుల మాదిరిగా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆశ్రమానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు కలెక్టర్ పండ్లు పంపిణీ చేసి, వారితో ఆప్యాయంగా మాట్లాడారు. వారి ఆరోగ్యం, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల సంక్షేమం కోసం సేవాశ్రమం నిర్వాహకులు చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, శిశు సంక్షేమ అధికారి శ్రీనివాస్, సాయి సేవాశ్రమ నిర్వాహకులు అశోక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# పార్థివాడ బస్తీలో డ్రైనేజీ సమస్యపై అధికారుల పరిశీలన

- వర్షపు నీటితో ఇళ్లలోకి మురుగునీరు.. శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల విజ్ఞప్తి

**తొలివెలుగు, వనస్థలిపురం :** చింతలకుంట డివిజన్ పరిధిలోని పార్థివాడ బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో డ్రైనేజీ నీరు రివర్స్‌గా ఇళ్లలోకి చేరుతుండటంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ఇళ్లలోకి సగం వరకు మురుగునీరు చేరుతున్న పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు పది రోజుల క్రితం చింతల రవికుమార్ బస్తీలో స్వయంగా పర్యటించి సమస్యను పరిశీలించారు. అనంతరం డ్రైనేజీ సమస్య తీవ్రతను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రియాంకతో కలిసి గురువారం పార్థివాడ బస్తీలో పర్యటించారు. వర్షపు నీరు, డ్రైనేజీ నీరు ఇళ్లలోకి చేరుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించిన అధికారులు స్థానికులను అడిగి సమస్య వివరాలను తెలుసుకున్నారు. బస్తీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతోందని, తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# గో సంరక్షణలో ఆదర్శం.. ఆవును దత్తత తీసుకున్న రైతు





**తొలివెలుగు, రామన్నపేట:** గో సంరక్షణలో ఓ రైతు ఆదర్శంగా నిలిచారు. మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రైతు జిట్టబోయిన నవీన్ యాదవ్ గురువారం స్థానికంగా ఉన్న శ్రీ జగద్గురు ఆది శంకర గోశాలను సందర్శించారు. అక్కడ గోవుల సంరక్షణను చూసి సంతోషం వ్యక్తం చేసిన ఆయన.. తన వంతుగా ఒక ఆవును దత్తత తీసుకుని, దాని పోషణ బాధ్యతను పూర్తిస్థాయిలో స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. నవీన్ యాదవ్ సేవా దృక్పథాన్ని గోశాల నిర్వాహకులు మండల నరసింహ అభినందించారు. ఈ సందర్భంగా గోశాల పక్షాన ఆయనకు ఓ కోడె దూడను కానుకగా అందజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ గోమాత రక్షణకు తమ వంతు సాయం అందించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. రైతు నవీన్ యాదవ్ దాతృత్వాన్ని గ్రామస్థులు కొనియాడారు.

# పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

- ఈ నెల 29 నుంచి సీపీఎం పాదయాత్ర
- రామన్నపేటలో పోస్టర్లు ఆవిష్కరించిన ఎం.డీ. జహంగీర్

**తొలివెలుగు, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏళ్ల తరబడి నిలిచిపోయిన సాగు, తాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ డిమాండ్ చేశారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 29, 30, 31 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్ ఇందిరాపార్కు వరకు నిర్వహించనున్న సీపీఎం పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రామన్నపేటలో పాదయాత్ర ప్రచార కరపత్రాలను ఆయన పార్టీ నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ... బస్వాపూర్, గంధమల్ల, చర్లగూడెం ప్రాజెక్టులకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలన్నారు. రామన్నపేట ప్రాంతానికి కీలకమైన ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువల పనులను వేగవంతం చేయాలని, మూసీ కలుషిత నీటి నుంచి ఉపశమనం లభించాలంటే బస్వాపూర్ రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలను రామన్నపేటకు మళ్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆసిఫ్‌నగర్ కాలువను పునరుద్ధరించాలని కోరారు. ఈ పాదయాత్రకు రైతులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి నగేష్, మండల కమిటీ సభ్యులు బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, తొలుపునూరి శ్రీనివాస్, అవనగంటి నగేష్, నీల అయిలయ్య, పల్లె సత్యం, దండిగ నర్సింహా, బావండ్లపల్లి సత్యం, శానగొండ వెంకటేశ్వర్లు, వళ్లమల్ల రమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రఘునాథపురానికి ఆసుపత్రి మంజూరు చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతికి కాంగ్రెస్ నేతలు, విరాళం దాత వినతి
- 3 కోట్లతో భవన నిర్మాణానికి కానుగంటి పద్మ నరసింహారెడ్డి సుముఖత

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం రఘునాథపురం గ్రామానికి ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు చేయించేందుకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఆసుపత్రి మంజూరైతే గ్రామానికి చెందిన దాత కానుగంటి పద్మ నరసింహారెడ్డి సుమారు రూ.3 కోట్లతో పక్కా ఆసుపత్రి భవనాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, నాయకులు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి ఆసుపత్రి మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ గాడిపల్లి శ్రవణ్ కుమార్, ఉపసర్పంచ్ కలకుంట్ల కళ్యాణి రాజు, మాజీ ఎంపీటీసీ బుడిగే రేణుక పెంటయ్య గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి రమేష్ తదితరులు మాట్లాడుతూ.. సుమారు 6 వేల జనాభా ఉన్న రఘునాథపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ఆసుపత్రి సబ్‌సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో ఆసుపత్రి మంజూరు కోసం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఆసుపత్రి సబ్‌సెంటర్ మంజూరైతే గ్రామానికి చెందిన దాత కానుగంటి పద్మ నరసింహారెడ్డి రూ.3 కోట్ల వ్యయంతో పక్కా భవనాన్ని నిర్మించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని ఇటీవల తహసీల్దార్ గోలి రవికిరణ్ సర్వే చేసి, సంబంధిత అధికారులకు నివేదికలు పంపినట్లు నాయకులు తెలిపారు. కలెక్టర్ ద్వారా



రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖకు ఆసుపత్రి మంజూరు ప్రతిపాదనలను వెంటనే పంపించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కోరినట్లు చెప్పారు. త్వరలోనే రఘునాథపురానికి ఆసుపత్రి సబ్‌సెంటర్ మంజూరవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ గాడిపల్లి శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ బుడిగే రేణుక పెంటయ్య గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి రమేష్, ఉపసర్పంచ్ కలకుంట్ల కళ్యాణి రాజు, వార్డు సభ్యులు వడ్లకొండ మధు, కటికం ప్రశాంత్, డొంకన భాస్కర్, ఉచ్చేంతల స్వామి, కలకుంట్ల భాస్కర్, గవ్వల సిద్ధులు, వెంగల్‌దాస్ వెంకటేశం, చల్లూరి చిన్న పోచయ్య, గుజ్జుక బాలరాజు, బల్ల మురళి తదితరులు పాల్గొన్నారు.



# ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై సీపీఎం ఆగ్రహం
- వలిగొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా.. వినతిపత్రం అందజేత

**తొలివెలుగు, వలిగొండ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో వలిగొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ దశరథ్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, గడిచిన 12 ఏళ్లలో ఉద్యోగాల భర్తీలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా సుమారు కోటి 83 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఒక్క రైల్వే శాఖలోనే 1.08 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనూ ప్రభుత్వ శాఖల్లో సుమారు రెండు లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన యూత్ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఉద్యమిస్తుంటే వారిపై దేశద్రోహులుగా ముద్ర వేసేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. ఖాళీ పోస్టులన్నింటినీ గుర్తించి ప్రత్యేక నియామక క్యాలెండర్ ప్రకటించి పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కలుకూరి రామచంద్రర్, వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు రాధారపు మల్లేశం, కొండూరు సత్తయ్య, వేముల చంద్రయ్య, శీలం ఇందిర, వేముల లక్ష్మయ్య, గంగాపురం వెంకటేశం, మైసోల్ల నరేందర్, దొడ్డి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

- 18 ఏళ్లకే ఓటు హక్కు తెచ్చిన ఘనత ఆయనదే
- రామన్నపేటలో ఘనంగా జయంతి వేడుకలు

**తొలివెలుగు, రామన్నపేట:** భారతరత్న, దేశ మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామన్నపేట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్న జగన్‌మోహన్, వలిగొండ-రామన్నపేట మార్కెట్ వైస్ ఛైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించి వారిని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేసిన చారిత్రాత్మక నిర్ణయం రాజీవ్ గాంధీదేనని కొనియాడారు. సాంకేతిక, సమాచార రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశాన్ని ఆధునిక పథంలో నిలిపారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా 18 ఏళ్లు పూర్తయిన యువతీయువకుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కందిమల్ల గోపాల్‌రెడ్డి, రామన్నపేట ఉపసర్పంచ్ మోటే రమేష్, వనం చంద్రశేఖర్, సాల్వేర్ అశోక్, బొడ్డు సాలయ్య, గుత్తా నర్సిరెడ్డి, మొహమ్మద్ నాసర్, బండ అంజిరెడ్డి, జెల్లా వెంకటేశం, పిట్ట వెంకటరెడ్డి, మహమ్మద్ అక్రమ్, కోట సుధాకర్, బత్తుల నవీన్, పున్న అమరేందర్, ఏ. పరమేశ్, కొమ్ము రామస్వామి, గొరిగె శేఖర్, బండ లింగస్వామి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎస్‌జీటీయూ మండల అధ్యక్షుడిగా బోయ శ్రీనివాస్

- ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: జిల్లా ఉపాధ్యక్షుడు కే. రవి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పట్టణ కేంద్రంలో గురువారం ఎస్‌జీటీయూ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు కే. రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బోయ శ్రీనివాస్‌ను మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బాలబాబు, ప్రధాన కార్యదర్శిగా కే. శ్రీధర్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు కే. రవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణతో పాటు సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండల కేంద్రంలో మాజీ ప్రధాని, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, పోలేపాక జనకీరాములు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధితో పాటు సాంకేతిక రంగంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆధునిక సాంకేతికతను దేశానికి చేరువ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. యువతను దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేయడంతో పాటు దేశ భవిష్యత్తు కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, రాజీవ్ గాంధీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మనోవేదనతో యువకుడి ఆత్మహత్య

- కనుముక్కలలో విషాదం.. మృతుడికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్ నివాళి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మనోవేదనతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భూదాన్ పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ జగన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చుక్క అనురాధ-జంగయ్య దంపతుల కుమారుడు చుక్క దేవిశ్రీప్రసాద్ (20) రంగారెడ్డి జిల్లాలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్న దేవిశ్రీప్రసాద్ బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. అనంతరం స్నానానికి వెళ్తున్నానని తల్లికి చెప్పి ఇంట్లోని బెడ్‌రూమ్ అటాచ్ బాత్‌రూమ్‌లోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. కొంతసేపటి తర్వాత బయటకు రాకపోవడంతో తల్లి అనురాధ పిలిచినా స్పందించలేదు. దీంతో కిటికీలో నుంచి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో అతడిని కిందకు దించి అంబులెన్స్‌లో వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే దేవిశ్రీప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

**పార్టీకి సేవలందించిన యువనేత:**

దేవిశ్రీప్రసాద్ కనుముక్కల గ్రామ బీజేపీ శాఖ అధ్యక్షుడిగా పనిచేస్తున్న నేపథ్యంలో ఆయన ఆకస్మిక మృతితో పార్టీ శ్రేణుల్లో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళు లర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్ దేవిశ్రీప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి దేవిశ్రీప్రసాద్ చేసిన కృషి మరువలేనిదన్నారు. చిన్న వయసులోనే ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేకల రవీందర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా ఏఐటీయూసీ జెండా




- నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి: ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్


**తొలివెలుగు, వలిగొండ:** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వలిగొండ మండల కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో గురువారం ఏఐటీయూసీ మండల 3వ మహాసభను నిర్వహించారు. చొప్పరి వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇమ్రాన్ మాట్లాడుతూ.. కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తోందని విమర్శించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని ప్రదేశాల్లో రక్షణతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, అందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, ఆటో కార్మికులు, పారిశ్రామిక కార్మికులు, స్కీం వర్కర్లు తదితర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అన్నారు. పెరుగుతున్న పని భారాన్ని తగ్గించి, ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**జిల్లా మహాసభను జయప్రదం చేయాలి:**

ఆగస్టు 26న భువనగిరిలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభను జయప్రదం చేయాలని ఇమ్రాన్ కోరారు. జిల్లాలోని కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, సీపీఐ సీనియర్ నాయకులు ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య, సల్వాదిరి రవీందర్, బొడిగ సుదర్శన్, సుద్దాల సాయికుమార్, ఏఐటీయూసీ నాయకులు కనకబోయిన ఆంజనేయులు, కందుకూరి సంజీవ, నానంచర్ల వెంకటేష్, ఐలపాక స్వామి, గడ్డల నరసింహ, బొలుగుల రామ్మూర్తి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

- దేశ భద్రత, సమగ్రతకు రాజీవ్ గాంధీ కృషి మరువలేనిది



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** దేశ భద్రత, సమగ్రత కోసం కృషి చేసి భారతదేశాన్ని ప్రపంచస్థాయిలో నిలిపిన నాయకుడు మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ అని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంగూరి పాండు అన్నారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని నేతాజీ చౌరస్తా వద్ద గురువారం పట్టణ కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొయ్యడ రజినీ శ్రీనివాస్ గౌడ్, బోడ సత్యనారాయణ, గునిగంటి రమేష్, కర్నాటి సుధారాణి, మక్తాల వెంకటేష్, వేముల ఆనంద్, గునిగంటి వెంకటేష్, రావిరాల బాలనరసింహ, ఎల్లస్వామి, జింకల యాదగిరి, కుక్క స్వామి, కర్నాటి బాలరాజు, కుడికాల రామనర్సింహ, సూరేపల్లి శ్రీను, పెండెం కైలాసం, గంజి రామదాసు, కుక్క దానయ్య, నల్ల నాగేష్, తాటి నర్సింహ, కుక్క కుమార్, ముప్పిడి శ్రీను, సామల సుధాకర్, రావుల అనిల్, సప్పిడి శేఖర్‌రెడ్డి, మోడేపు అశోక్, ఎడ్ల లింగస్వామి, జింకల స్వరూప, గుర్రం హేమలత, ఆదిమూలం వెంకటేష్, చెరుకు స్వప్న, కుక్క బాలస్వామి, పోనమోని కావ్య, కొంగరీ ప్రకాష్, బిట్ల గణేష్, జింకల జయసూర్య, రాజు మునుకుంట్ల, గుండు నవీన్, సిద్ధగోని మహేష్, వలందాసు ప్రవీణ్, ఇటమోనీ మహేష్, పెంట నవీన్, కుక్క అరుణ్, తంగెళ్ల మల్లేష్, చేరాల మహేంద్ర, మెరుగు కుమార్, గంగదేవి మహేష్, కుక్క వంశీ, కొమ్ము గణేష్, కుక్క శివ తదితరులు పాల్గొన్నారు.

## ముప్పారంలో ఘనంగా బోనాలు

- భారీగా తరలివచ్చిన భక్తజనం.. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

**తొలివెలుగు, నిడమనూరు:** మండలంలోని ముప్పారం గ్రామంలో శ్రావణమాస బోనాల వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఆలంపల్లి రోజా కృష్ణ ఆధ్వర్యంలో గ్రామదేవతలైన ఈదమ్మ, ముత్యాలమ్మతో పాటు బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించి బోనాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. వేడుకల్లో భాగంగా గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రాపర్తి యాదగిరి, యువతీ యువకులు, వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంట్లోకి చొరబడి బెదిరింపులు.. నలుగురిపై కేసు

- భూ వివాదమే కారణం
- బాధితుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన రాజాపేట పోలీసులు

**తొలివెలుగు, రాజాపేట:** భూ వివాదం నేపథ్యంలో ఇంట్లోకి చొరబడి గొడవకు దిగి దూషణలు, బెదిరింపులకు పాల్పడిన నలుగురిపై రాజాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బొందుగుల గ్రామానికి చెందిన బొచ్చు మల్లయ్య పేరుపై సర్వే నంబర్ 839లో 25 గుంటల వ్యవసాయ భూమి సుమారు ఎనిమిదేళ్ల క్రితం పొరపాటున ఆన్‌లైన్‌లో నమోదైంది. అయితే అదే గ్రామానికి చెందిన బోడసు యాదగిరి, బోడసు చంద్రయ్య, బోడసు ఐలయ్య, బోడసు శ్రీను ఆ భూమి తమదేనని, తమ పేర్లపై నమోదు చేయాలని కోరినట్లు తెలిపారు. దీంతో మల్లయ్య వారి డిమాండ్‌కు అంగీకరించి రాజాపేట మండల రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, ప్రస్తుతం ఈ విషయం విచారణలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆగస్టు 11న ఉదయం సుమారు 8 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు తన ఇంట్లోకి చొరబడి తనతో గొడవకు దిగారని మల్లయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ చెప్పులతో కొట్టేందుకు ప్రయత్నించారని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు తెలిపారు. తన భార్య వజ్రమ్మ, కుమార్తె బాలమణి నిందితులను ప్రశ్నించగా వారిని సైతం అసభ్య పదజాలంతో దూషించి, అనుచితంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ ప్రాంగణంలో గురువారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, ఉపసర్పంచ్ కేదారి గౌడ్, నాయకులు నవీన్ కుమార్, జిల్లా కార్యదర్శి పిట్టల జయరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ గోళ్లన స్వామి, యూత్ అధ్యక్షుడు గుర్రం రూపేష్, వెంకటేష్, సోమారం ఉపసర్పంచ్ జంపయ్య, గొలుసుల యాకుబ్, డాక్టర్ చింతల రవి, ఉపాధ్యక్షులు ఆకిరెడ్డి రమేష్, బుతుకూరి నర్సిరెడ్డి, గాడిపల్లి శ్రవణ్, రేగు సిద్ధులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



**చల్లూరులోనూ ఘన నివాళులు:**

మండలంలోని చల్లూరు గ్రామంలోనూ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య గౌడ్, ఉపసర్పంచ్ బొంత సుధాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ గౌరయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించండి

- తహసీల్దార్ రవికిరణ్, ఎంఈఓ రమేష్‌లకు వినతిపత్రం అందజేత




**తొలివెలుగు, రాజాపేట:** సెన్సెస్ డ్యూటీలో రిజర్వ్‌లో ఉన్న సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని పీఆర్టీయూటీఎస్ రాజాపేట మండల శాఖ అధ్యక్షుడు గౌటే బాలరాజు కోరారు. ఈ మేరకు గురువారం పీఆర్టీయూటీఎస్ రాజాపేట మండల శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షుడు గౌటే బాలరాజు నాయకత్వంలో తహసీల్దార్ గోలి రవికిరణ్, మండల విద్యాధికారి చందా రమేష్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రావాల్సిన సీఎల్‌లు మంజూరు చేయడంతో పాటు, సెన్సెస్ డ్యూటీ నిర్వహించిన ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ జారీ చేయాలని వినతిపత్రంలో కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను అధికారులు సానుకూలంగా పరిశీలించి, డ్యూటీ సర్టిఫికెట్లు, సంబంధిత ప్రొసీడింగ్స్ త్వరగా జారీ చేయాలని పీఆర్టీయూటీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి సంపతి సుబ్బరాజు, వంశీధర్, కనకయ్య, బాలరాజు, ఇమ్మడి శిరీష, సరిత తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా: ఒకరి అరెస్టు

- 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాహనం స్వాధీనం
- రాజాపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద తనిఖీలు

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని రాజాపేట పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 19న పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కొండ యాదయ్యకు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అనుమానాస్పదంగా వెళ్తున్న టాటా జీనాన్ వాహనం (ఏపీ02వై 5916)ను ఆపి తనిఖీ చేయగా, అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాహనంలో ఉన్న వ్యక్తిని విచారించగా పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్య నవీన్ (26)గా గుర్తించారు. రేషన్ కార్డుదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి, గజ్వేల్ మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 16 క్వింటాళ్ల బరువున్న 21 ప్లాస్టిక్ బస్తాల పీడీఎస్ బియ్యంతో పాటు టాటా జీనాన్ వాహనాన్ని పంచుల సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## వైభవంగా ఎర్ర పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

- బొందుగులలో వైభవంగా వేడుకలు
- హాజరైన సర్పంచ్ ఎల్లయ్య, గ్రామ పెద్దలు



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం బొందుగుల గ్రామంలో ఎర్రపోచమ్మ నూతన దేవస్థానం, నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన దేవస్థానంలో ఎర్రపోచమ్మ విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొనాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాయ్యావుల ఎల్లయ్య, ఉపసర్పంచ్ అబ్దుల్ అబిద్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు

- 49 రోజులకు గాను కానుకల లెక్కింపు
- 114 గ్రాముల బంగారం, 3.9 కిలోల వెండి
- భారీగా విదేశీ కరెన్సీ సమర్పించిన భక్తులు





**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. గత 49 రోజులకు సంబంధించిన స్వామివారి హుండీలను గురువారం దేవస్థానం అధికారులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో స్వామివారికి నగదు రూపంలో రూ.3,52,47,662 (మూడు కోట్ల 52 లక్షల 47 వేల 662 రూపాయలు) ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వీటితో పాటు 114 గ్రాముల మిశ్రమ బంగారం, 3,900 గ్రాముల (3.9 కిలోలు) మిశ్రమ వెండిని భక్తులు కానుకలుగా సమర్పించుకున్నారు.

**పోటెత్తిన విదేశీ కరెన్సీ:**

విదేశాల నుంచి వచ్చిన భక్తులు సైతం స్వామివారికి పెద్ద ఎత్తున కరెన్సీ సమర్పించారు. అమెరికా 2047 డాలర్లు, ఇంగ్లాండ్ 190 పౌండ్లు, కెనడా 85 డాలర్లు, ఆస్ట్రేలియా 110 డాలర్లు, సింగపూర్ 16, న్యూజిలాండ్ 5 డాలర్లు, యూరో 30, యూఏఈ (దిరామ్స్) 565, నేపాల్ 180, వియత్నాం 1,000, మలేషియా 53, సౌదీ అరేబియా 116, ఖతార్ 2, సౌత్ ఆఫ్రికా 100, కెన్యా 100 చొప్పున విదేశీ కరెన్సీ నోట్లు హుండీ ద్వారా సమకూరాయి. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ఈవో భవాని శంకర్, డీఈవో దూర్వాసుల భాస్కర్ శర్మ, ఏఈవోలు రఘు, సురేందర్ రెడ్డి, అశోక్, రాజన్ బాబు, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే మేలు

- అంకిరెడ్డిగూడెంలో అవగాహన సదస్సు
- సూచించిన ఏఈవో వీణ, సర్పంచ్ మల్లేష్ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ (ఆరుతడి) పంటలపై దృష్టి సారించాలని లింగోజిగూడెం ఏఈవో వీణ సూచించారు. చౌటుప్పల్ మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన గురువారం ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో వీణ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వరి సాగుతో దిగుబడి తగ్గి నష్టాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. దానికి బదులు కంది, పెసర, మినుము, బొబ్బర్లు, శనగలు, ఉలవలు, కూరగాయలు పండించడం ద్వారా రైతులు సత్వర లాభాలు గడించవచ్చని వివరించారు. అనంతరం సర్పంచ్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. రైతులు తమ వ్యవసాయ భూములను ఖాళీగా ఉంచకుండా ఏదో ఒక పంటను తప్పనిసరిగా సాగు చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కాకులారం మల్లారెడ్డి, దొడ్ల సెట్టయ్య, పర్ని రామచంద్రారెడ్డి, ఇటికాల నర్సిరెడ్డి, భీమగోని బాలరాజ్, మోడెపు నరసింహ, పెంటయ్య, జంగయ్య, ముద్దం సెట్టయ్య, వెంకటేశం, శ్రీను, ముత్యాలు, సుర్వి లచ్చయ్య, రాములు, దాసు, గంగిరెడ్డి అంజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ఇమ్మడి ఏసుదాస్, ఇరగదిండ్ల ఈద్దయ్య, కే యాదిరెడ్డి, కే జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత నాగార్జునకు ఘన సత్కారం

- ఇంటెలిజెన్స్ విభాగంలో ప్రతిభకు గుర్తింపు.. అభినందించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం సోమారం గ్రామానికి చెందిన ఇంటెలిజెన్స్ ఫీల్డ్ ఆఫీసర్ నాగార్జునకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు లభించిన సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా సత్కరించి అభినందించారు. గురువారం నాగార్జున స్వగ్రామంలో జరిగిన కార్యక్రమంలో బీర్ల ఐలయ్య, పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్‌లు నాగార్జునను శాలువాతో సత్కరించారు. ఇంటెలిజెన్స్ విభాగంలో విధులు సమర్థవంతంగా నిర్వహిస్తూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసినందుకు నాగార్జునకు ప్రభుత్వం తరపున జిల్లా ఉత్తమ అవార్డు దక్కినట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డును పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్న నాగార్జునను ఈ సందర్భంగా నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. నాగార్జున మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అవార్డు ద్వారా ఆయన సేవలకు తగిన గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేణికుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగా నరేష్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## బిర్రు శ్రీనివాస్‌కు ఘన సత్కారం

- ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సన్మానం
- రాజాపేట మండల జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుక

**తొలివెలుగు, రాజాపేట:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజాపేట మండల జర్నలిస్టు అసోసియేషన్ ప్రెస్ ఫోటోగ్రాఫర్, జర్నలిస్ట్, మండల ఫోటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బిర్రు శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. మండల జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. చిత్రాల ద్వారా సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు చేరవేయడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకమైనదని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పెంట రమేష్, అధ్యక్షుడు ఉప్పల రమేష్, ప్రధాన కార్యదర్శి గొట్టిపాముల నర్సింలు, ఆర్యవైశ్య సంఘం యువజన విభాగం అధ్యక్షుడు నంగునూరి రాజు, శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ అభివృద్ధి సేవా కమిటీ సభ్యుడు బెజుగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




# పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు పాదయాత్ర

- 29 నుంచి భువనగిరి-హైదరాబాద్ వరకు..
- 31న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా
- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.డి.జహంగీర్

**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు భువనగిరి నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా కార్యదర్శి ఎం.డి.జహంగీర్ తెలిపారు. చౌటుప్పల్‌లో సీపీఎం మున్సిపల్ కమిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా ఏర్పడి దశాబ్దం గడిచినా సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం గమనార్హమన్నారు. బస్వాపురం, గంధమల్ల, చర్లగూడెం, ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి, పునాదిగాని కాలువలకు నిధుల కొరత లేకుండా చూసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల అనుసంధానానికి సంబంధించి జిల్లా డీపీఆర్‌ను ప్రకటించి నిధులు విడుదల చేయాలని కోరారు. మూడు రోజుల పాదయాత్ర అనంతరం ఆగస్టు 31న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి.పాషా, బండారు నరసింహ, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, దండా అరుణ్ కుమార్, భావండ్లపల్లి స్వామి, బొడ్డు అంజిరెడ్డి, కనకయ్య, సప్పిడి శ్రీనివాసరెడ్డి, పర్ని ధర్మారెడ్డి, గుణముని ఐలయ్య, తూర్పునూరి మల్లేశం, ఆర్టీఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి సాగుతోనే సిరులు

- వరికి బదులు తక్కువ నీటి పంటలపై దృష్టి పెట్టాలి
- నీటిని పొదుపుగా వాడుకోవాలి
- మసీదుగూడెం సదస్సులో కలెక్టర్ అనురాగ్ జయంతి





**తొలివెలుగు, చౌటుప్పల్:** ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్‌లో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున రైతులు వరి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం చౌటుప్పల్ మండలం మసీదుగూడెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదైందని, అందువల్ల ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరికంటే తక్కువ నీటితో పండే ఆయిల్‌పామ్, కూరగాయలు, పూలతోటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. ఇదే సదస్సులో రైతు జక్కిడి కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. పెద్దకొండూరులో ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ ప్లాంట్‌కు అవసరమైన సూపర్ నేపియర్ గడ్డిని సాగు చేయడం ద్వారా కూడా రైతులు మంచి లాభాలు గడించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెల్మ శేఖర్‌రెడ్డి, డీఎల్‌పీవో డి.ప్రతాప్‌నాయక్, జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ఏవో ముత్యాల నాగరాజు, ఉద్యానవన అధికారి కవిత, సర్పంచ్ మర్రి వంశీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ మసాలాలు పట్టివేత




రామంతాపూర్ : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో కల్తీ మసాలా తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు చేశాయి. పక్కా సమాచారంతో మేడిపల్లి శ్రీనివాసనగర్ కాలనీలోని సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌లో గురువారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్ర వాతావరణంలో పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. కారం పొడిలో ఏకంగా 30 శాతం చెక్కపొడి కలిపినట్లు.. స్వదేశీ స్వస్తిక్ బ్రాండ్ పేరుతో డూప్లికేట్ ప్యాకింగ్, లేబులింగ్ చేసినట్లు నిర్ధారించారు. ఒరిజినల్ బ్రాండ్‌ను పోలిన ప్యాకెట్లలో కల్తీ కారంపొడి విక్రయానికి సిద్ధం చేసినట్లు గుర్తించారు. మొత్తం 10,890 కిలోల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

# మార్గదర్శి'కి సుప్రీంలో భారీ ఊరట.. ఉండవల్లి పిటిషన్ కొట్టివేత



ఈనాడు గ్రూప్ నకు చెందిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో ఆ సంస్థకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ కేసులో ప్రజా ప్రయోజనం ఏమీ కనిపించడం లేదని, ఇది వ్యక్తిగత వివాదంలా ఉందని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

**విచారణలో వాదనలు, కోర్టు వ్యాఖ్యలు**

గురువారం ఈ పిటిషన్‌పై తుది విచారణ సందర్భంగా మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, నాగముత్తు వాదనలు వినిపించారు. డిపాజిటర్లకు ఇప్పటివరకు రూ.2,500 కోట్లు చెల్లించామని, క్లెయిమ్ చేయని రూ.5.23 కోట్లను ఎస్క్రో అకౌంట్‌లో ఉంచామని వారు కోర్టుకు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే పబ్లిక్ నోటీసు జారీ చేసి, సెటిల్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు. ఈ సమయంలో ధర్మాసనం పిటిషనర్ ఉండవల్లి అరుణ్ కుమార్‌ను ఉద్దేశించి పలు కీలక ప్రశ్నలు సంధించింది. "ఈ పిటిషన్ వేసి, పోరాడటానికి మీరెవరు?" అని ప్రశ్నించింది. "ఈ కేసు వివరాలు పరిశీలిస్తే ఇది పూర్తిగా వ్యక్తిగత వివాదంలా కనిపిస్తోంది. ఇందులో ఎలాంటి ప్రజా ప్రయోజనం మాకు కనిపించడం లేదు. మీరు వాదించే కొద్దీ మీపైనే అనుమానాలు పెరుగుతున్నాయి" అని జస్టిస్ సుందరేశ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ధర్మాసనం ఉండవల్లి పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

**కేసు నేపథ్యం, తాజా పరిణామాలు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2008లో మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి డిపాజిట్లు సేకరించిందనే ఆరోపణలతో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, 2025 ఆగస్టులో ఆ క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టివేసింది. డిపాజిటర్లకు డబ్బులు తిరిగి చెల్లించడం, సంస్థ ఛైర్మన్ రామోజీ రావు మరణం వంటి పరిణామాల నేపథ్యంలో కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టివేయడంతో తెలంగాణ హైకోర్టు తీర్పునకు ఆమోదం లభించినట్లయింది. దీంతో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై దశాబ్దాలుగా నడుస్తున్న క్రిమినల్ కేసులకు పూర్తిగా ముగింపు పలికినట్లయింది.

# ఏఈ నూకరాజు కుమార్తె సౌజన్య మృతదేహం లభ్యం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటనలో మరో విషాదం వెలుగుచూసింది. గోదావరి నదిలో గల్లంతైన ఆయన కుమార్తె సౌజన్య మృతదేహం లభ్యమైంది. రావులపాలెం మండలం కొమరాజులంక వద్ద గురువారం ఆమె మృతదేహాన్ని అధికారులు గుర్తించారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దాదాపు 35 కిలోమీటర్ల దూరం కొట్టుకువచ్చి ఇక్కడ తేలింది. కాకినాడకు చెందిన రైఫిల్ షూటింగ్ కోచ్ సాదిక్ ఖాన్ వేధింపులు భరించలేక నూకరాజు తన కుటుంబంతో కలిసి ఇటీవల గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటికే నూకరాజు మృతదేహం లభ్యం కాగా, ఆయన మనవడు కార్తికేయ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రస్తుతం నూకరాజు భార్య మీనా ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు, ఈ ఘటనకు ప్రధాన కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సాదిక్ ఖాన్ పరారీలో ఉన్నాడు. నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# ప్రజాసేవను ఓర్వలేకే పార్టీ పదవుల నుంచి తొలగింపు

- సంస్థాన్ నారాయణపురం బీజేపీలో అంతర్గత విభేదాలు
- మండల అధ్యక్షుడి నిర్ణయంపై ముగ్గురు నేతల తీవ్ర ఆగ్రహం



**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం:** ప్రజా సేవ చేస్తున్న తమను ఓర్వలేకనే పార్టీ పదవుల నుంచి తొలగించారని సంస్థాన్ నారాయణపురం మండలానికి చెందిన బీజేపీ నాయకులు బండమీది కిరణ్, ఎలిజాల శ్రీను, గుండె మల్లేష్ యాదవ్ ఆరోపించారు. తమపై ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా క్రమశిక్షణ చర్యల పేరుతో పదవుల నుంచి తొలగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య, విద్య, ఉపాధి రంగాల్లో ప్రజలకు సేవలు అందించడమే తాము చేసిన తప్పా? అని ప్రశ్నించారు. దశాబ్దాలుగా పార్టీ కోసం నిజాయితీగా పనిచేస్తున్న తమపై కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. పార్టీ నాయకత్వానికి సేవా గుణం, కార్యకర్తలను కలుపుకొని వెళ్లే స్వభావం ఉండాలని పేర్కొన్నారు.

**'యువతకు, బీసీ నాయకులకు స్థానం లేదా?'**

కేంద్ర ప్రభుత్వం బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్న సమయంలో సంస్థాన్ నారాయణపురం మండలంలో బీసీ నాయకుల పార్టీ పదవులను తొలగించడం నియంతృత్వానికి నిదర్శనమని వారు విమర్శించారు. పార్టీలో ప్రజాప్రతినిధులుగా ఉన్న తమను ఓర్వలేకనే చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. యువతకు పార్టీలో తగిన ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలను పక్కనపెట్టి కొంతమందికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పార్టీ బలహీనపడుతోందని ఆరోపించారు. దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తున్న సూరపల్లి శివాజీని పార్టీ కార్యక్రమాలకు దూరం చేయడం ఇందుకు నిదర్శనమన్నారు.

**జిల్లా నాయకత్వం జోక్యం చేసుకోవాలి:**

మండల బీజేపీ అధ్యక్షుడు సుర్వి రాజు, దోనూరు వీరారెడ్డి వ్యవహారశైలిపై జిల్లా నాయకత్వం సమగ్రంగా విచారణ జరపాలని వారు కోరారు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నాయకులపై చర్యలు తీసుకుని సంస్థాన్ నారాయణపురంలో బీజేపీని బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమపై తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే పునఃపరిశీలించాలని, ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణను దెబ్బతీసే చర్యలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. పార్టీ అధిష్ఠానం స్పందించి సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వారు తెలిపారు.

# సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే వేటు వేస్తారా?

- రాజకీయ పార్టీల చర్యలపై ఇ.ఎల్.వి.భాస్కర్ మండిపాటు
- ఇలాంటి చర్యలు నాయకుల సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం
- యువతను అణచివేస్తే ప్రజాస్వామ్యబద్ధంగానే బుద్ధి చెబుతారు
- సభ్యులకు ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా

**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం :** సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న సభ్యులపై రాజకీయ పార్టీలు క్రమశిక్షణ చర్యల పేరుతో వేటు వేయడం అప్రజాస్వామికమని ఇ.ఎల్.వి.భాస్కర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఇ.ఎల్.వి.భాస్కర్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకొని కేవలం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ ఫౌండేషన్ పనిచేస్తోందని తెలిపారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, అలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనే వారిపై కక్ష సాధింపులకు దిగడం విచారకరమన్నారు. తమ ఫౌండేషన్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి సొంతం కాదని, అలాగే ఏ పార్టీకి వ్యతిరేకం కూడా కాదని ఆయన స్పష్టం చేశారు. తమ కార్యక్రమాల్లో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నారని గుర్తుచేశారు. సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తూ రాజకీయ వేధింపులు ఎదుర్కొనే యువతకు, సభ్యులకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. యువతను అణచివేయాలని చూస్తే సహించేది లేదని, రానున్న రోజుల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో వారే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా తమ సేవా ప్రయాణం నిరంతరాయంగా కొనసాగుతుందని భాస్కర్ స్పష్టం చేశారు.





# ఏసీల ధరలకు రెక్కలు..

## 12 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించిన బ్లూస్టార్

హైదరాబాద్: ఎయిర్ కండిషనర్ల(ఏసీ) ధరలకు రెక్కలొచ్చాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా కమోడిటీ ఉత్పత్తులు భగ్గుమనడంతో దేశవ్యాప్తంగా ఏసీ ధరలు భారీగా పెంచుతున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు 10 శాతం వరకు ధరలు పెంచుతున్నట్టు ప్రకటించగా.. తాజాగా ఈ జాబితాలోకి ప్రముఖ ఏసీల తయారీ సంస్థ బ్లూస్టార్ కూడా చేరింది. కంపెనీకి చెందిన ఏసీల ధరలను 12 శాతం వరకు పెంచుతున్నట్టు కంపెనీ గ్రూపు ప్రెసిడెంట్ మోహిత్ సుద్ తెలిపారు. రాగి, అల్యూమినియంతోపాటు నూతన విద్యుత్ నిబంధనలు అమలు చేయడంతో సంస్థపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ఏసీల ధరలను పెంచాల్సి వస్తున్నదన్నారు. దీంతో ఫైవ్-స్టార్ ఏసీలు కనిష్ఠంగా 5 శాతం వరకు గరిష్ఠంగా 15 శాతం వరకు సవరించినట్టు చెప్పారు. జీఎస్టీని 10 శాతానికి తగ్గించడంతో ఏసీల ధరలు దిగొచ్చాయని, కానీ యుద్ధ ప్రభావంతో వీటి ధరలు 15 శాతం పెరగడంతో మొత్తంగా గతేడాదితో పోలిస్తే వీటి ధరలు 5 శాతం వరకు అధికమయ్యాయన్నారు.రాష్ట్ర మార్కెట్లోకి నూతన శ్రేణి రూమ్ 125 రకాల ఏసీలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఏసీల అమ్మకాలు 5 శాతం పడిపోయే అవకాశాలున్నాయని, ప్రధానంగా ధరలు పెరుగడం, వర్షాభావ పరిస్థితులు కూడా మరో కారణమన్నారు.

# కోటక్ మహీంద్రాలో భారీ కుంభకోణం కలకలం




ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో జరిగిన రూ. 590 కోట్ల భారీ కుంభకోణం మరువకముందేమరో బ్యాంకులో జరిగిన భారీ మోసం కలకలం రేపుతోంది. హర్యానాలో కొటక్ మహీంద్రా బ్యాంక్‌లో రూ. 160 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఖీఐ) కుంభకోణం వెలుగులోకి వచ్చింది.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇక్కడ ఉన్నాయి హర్యానాలోని పంచకుల మునిసిపల్ కార్పొరేషన్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల విలువ దాదాపు రూ. 160 కోట్లు. అయితే, ఎఫ్‌డీల్లో జమ చేసిన నధులు అసలు డిపాజిట్టే కాలేదు. నకిలీ పత్రాలు సృష్టించి ఆ సొమ్మును ఇతర మోసపూరిత ఖాతాలకు మళ్లించారు. ఇందుకోసం హర్యానాకు చెందిన పంచకుల మున్సిపల్ కార్పొరేషన్‌కు నకిలీ పత్రాలను జారీ చేశారని అధికారులు గుర్తించారు. ఈ భారీ మోసంలో బ్యాంక్ ఉద్యోగులతో పాటు, మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల ప్రమేయం కూడా ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

**వెలుగులోకి ఎలా వచ్చింది?**

రూ. 58 కోట్ల విలువైన ఒక ఖీఐ గడువు ముగిసిన తర్వాత, ఆ మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయాలని కార్పొరేషన్ బ్యాంకును కోరినప్పుడు ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. బ్యాంకు స్టేట్‌మెంట్ ప్రకారం బదిలీ పూర్తయినట్లు చూపించినప్పటికీ, ఆ నిధులు కార్పొరేషన్ ఖాతాకు చేరలేదు. ఆరా తీస్తే ఆ బ్యాంక్ స్టేట్‌మెంట్ కూడా నకిలీదేనని నిర్ధారణ అయ్యింది.డబ్బు మాయమైపోయిందని తేలింది. ఈ వ్యవహారంలో బ్యాంకు జారీ చేసిన ఖీఐలన్నీ నకిలీవని, ఖాతాలో అసలు నిధులే లేవని గుర్తించారు. నకిలీ పత్రాలను ఉపయోగించి బ్యాంకు ఉద్యోగులు చాలాకాలం పాటు ఈ నిధుల దుర్వినియోగాన్ని దాచిపెట్టారని ఆరోపణలు వెల్లువెత్తాయి.తమ ఎఫ్‌డీ నిధులను బదిలీ చేయమని బ్యాంకును కోరినప్పుడే ఈ వ్యవహారం బైటపడిందని, పంచకుల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కుమార్ తెలిపారు. ఇదే విషయాన్ని స్టేట్ విజిలెన్స్‌కు నివేదించారు. బ్యాంక్‌పై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడంతో పాటు, ఆ బ్యాంక్‌ను ప్రభుత్వ పనుల నుండి తొలగించాలని (ఎవ-వఎజుఖుఅవశ్రీ) హర్యానా ప్రభుత్వాన్ని కోరారు.

# గ్యాస్ కొరతకు చెక్.. 20 శాతం పెరిగిన కేటాయింపు!



భారతదేశంలో వాణిజ్య ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల లభ్యతను మరింత బలపరచడానికి ముఖ్యమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. ఇందులో భాగంగానే.. దేశవ్యాప్తంగా కమర్షియల్ సరఫరాను పెంచే నిర్ణయం తీసుకుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. అదనంగా 20% కమర్షియల్ సిలిండర్ల కేటాయింపును ఆమోదించింది. దీంతో మొత్తం కేటాయింపు సగటు నెలవారీ అవసరంలో 50%కి పెరిగింది. ఈ పెంపు వలన వాణిజ్య రంగాలకు గ్యాస్ సరఫరా మరింత స్థిరంగా, సమృద్ధిగా అందుబాటులో ఉంటుంది. ఇకపై హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సేవలు వంటి రంగాలు గ్యాస్ కొరత నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుంది. కాగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గ్యాస్ సిలిండర్లను సమయానికి, సులభంగా అందేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నిర్ణయం వల్ల వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను అంతరాయం లేకుండా కొనసాగించగలుగుతాయి. అంతేకాకుండా, వినియోగదారులకు ఆహారం, ఇతర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చేస్తుంది. గ్యాస్ కొరత కారణంగా ఎదురయ్యే సమస్యలు తగ్గుతాయి. ధరల స్థిరత్వం కూడా మెరుగుపడే అవకాశం ఉంది.

# గల్ఫ్ ఉద్రిక్తతల ప్రభావం


# రూపాయి, ద్రవ్యోల్బణ దెబ్బకు వడ్డీరేట్లు పైపైకి?




న్యూఢిల్లీ: ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్‌ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి (60 బేసిస్ పాయింట్లు) పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హొర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది.

**4.6 శాతానికి ద్రవ్యోల్బణం!**

ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయగలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హొర్ముజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్ధం (ఏప్రిల్ 15) వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు (అర శాతం) పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగదారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగుతుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది.



# నెలకు అద్దె ఏ రూ.1.2 లక్షలు!

కలల నగరం ముంబైలో అద్దె కోసం ఇల్లు దొరకడం ఒక ఎత్తయితే, దాని అద్దె చెల్లించడం మరో ఎత్తు. సామాన్యుడి నెల జీతం కంటే కొన్ని ప్రదేశాల్లో ఇక్కడ అద్దెలే ఎక్కువగా ఉంటాయన్నది జీర్ణించుకోలేని వాస్తవం. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియో ముంబై జీవన ప్రమాణాలు, అద్దె భారం గురించి చర్చకు తెరలేపింది. ప్రముఖ వ్లాగర్ ఆర్య కొఠారి తన ఇన్‌స్టాగ్రామ్ సిరీస్ 'రెంట్ ఇన్ ముంబై - ఈపీ 4' లో భాగంగా అంధేరీ వెస్ట్ ప్రాంతంలో ఒక యువతిని ఇంటర్వ్యూ చేశారు. ఆ ప్రాంతంలో ఒక 3బీహెచ్‌కే (మూడు పడకగదుల) ఫ్లాట్ కోసం ఆమె నెలకు ఏకంగా రూ. 1.2 లక్షలు అద్దె చెల్లిస్తున్నట్లు వెల్లడించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఆ విశాలమైన గది, ఆధునిక వంటగది చూస్తుంటే ముంబై వంటి నగరంలో అది ఎంత లగ్జరీనో అర్థమవుతుంది. ఈ వీడియోపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. 'ముంబైలో అద్దె కట్టడమే ఒక పూర్తిస్థాయి ఉద్యోగంలా మారిపోయింది' అని ఒక యూజర్ వ్యాఖ్యానించారు. 'ఒకరికి రూ. 1.2 లక్షల అద్దె సౌకర్యం కావచ్చు, మరొకరికి రూ. 80 వేల జీతంతో బతకడమే పెద్ద పోరాటం కావచ్చు' అని మరికొరు అన్నారు.

# జియో.. జెరోధా.. ?కొత్త మ్యూచువల్ ఫండ్‌లు




జెరోధా మ్యూచువల్ ఫండ్ నుంచి నిఫ్టీ మిడ్‌స్మాల్‌క్యాప్ 50:50 ఇండెక్స్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ 23న ప్రారంభం కానుంది. ఏప్రిల్ 6 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఇన్వెస్టర్లు రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ ఫండ్‌ను కేదార్‌నాథ్ మిరాజ్‌కార్ నిర్వహించనున్నారు. ఈ ఫండ్ అధిక రిస్క్ కిందకు వస్తుంది. నిఫ్టీ మిడ్‌స్మాల్‌క్యాప్ 400 50:50 ఇండెక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. కనుక సూచీ రాబడులే ఈ పథకం పనితీరుకు ప్రామాణికంగా ఉంటాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగంలో బలమైన వృద్ధి అవకాశాలున్న కంపెనీల్లో దీర్ఘకాలం పెట్టుబడుల ద్వారా మెరుగైన సంపద సృష్టించుకోవాలని భావించే ఇన్వెస్టర్లకు ఈ పథకం అనుకూలంగా ఉంటుంది.

**జియో బ్లాక్‌రాక్ లార్జ్‌క్యాప్ ఫండ్**

జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా జియో బ్లాక్‌రాక్ లార్జ్‌క్యాప్ ఫండ్‌ను తీసుకొచ్చింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఈ నెల 24న ప్రారంభమై, ఏప్రిల్ 7న ముగుస్తుంది. లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడిని వృద్ధి చేయడం ఈ పథకం ఉద్దేశ్యం. బీఎస్ఈ 100 ఇండెక్స్ (టీఆర్ఐ) ఈ పథకం పనితీరుకు ప్రామాణికం. తన్వి కచేరియా, సాహిల్ చౌదరి ఈ పథకానికి మేనేజర్లుగా వ్యవహరించనున్నారు. డైరెక్ట్‌ప్లాన్ (మధ్యవర్తుల ప్రమేయం లేని), గ్రోత్ ఆప్షన్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. లార్జ్‌క్యాప్ కంపెనీల్లో 80--100 శాతం వరకు, 0--20 శాతం మేర ఇతర కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది.


# 30 రోజుల రీఛార్జ్ తప్పనిసరి!

మొబైల్ వినియోగదారుల ప్రయోజనాలే పరమావధిగా టెలికాం రంగంలో మార్పులకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో రాజ్యమేలుతున్న 28 రోజుల రీఛార్జ్ ప్లాన్ల స్థానంలో పూర్తి 30 రోజుల వ్యాలిడిటీ కలిగిన ప్లాన్లను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని టెలికాం ఆపరేటర్లపై కేంద్రం ఒత్తిడి పెంచుతోంది. ఇటీవల రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా లేవనెత్తిన అంశాలపై కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సానుకూలంగా స్పందించారు. సాధారణంగా నెల అంటే 30 లేదా 31 రోజులు ఉంటుంది. కానీ, టెలికాం కంపెనీలు నెలవారీ ప్లాన్ పేరిట 28 రోజుల వ్యాలిడిటీనే ఇస్తున్నాయి. దీనివల్ల వినియోగదారుడు ఏడాదికి 12 సార్లు కాకుండా 13 సార్లు రీఛార్జ్ చేయాల్సి వస్తోందని రాఘవ్ చద్దా పార్లమెంటులో గళమెత్తారు. ఆయన లేవనెత్తిన అంశాలు కింది విధంగా ఉన్నాయి.

ఒకరోజుకు 2 జీబీ డేటా ఇస్తే వినియోగదారుడు 1.5 జీబీ మాత్రమే వాడితే మిగిలిన 0.5 జీబీ అర్ధరాత్రికి మాయమైపోతోంది.

ది వినియోగదారుడిని వంచించడమే. ఉపయోగించని డేటాను మరుసటి రోజుకు క్యారీ ఫార్వర్డ్ చేయాలి.

రీఛార్జ్ గడువు ముగిసిన వెంటనే ఇన్‌కమింగ్ కాల్స్ నిలిపివేయడం సరికాదు. కనీసం ఏడాది పాటు ఇన్‌కమింగ్ సదుపాయం ఉండాలి. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నిబంధనల ప్రకారం..




ప్రతి ఆపరేటర్ తమ ప్లాన్ల జాబితాలో కచ్చితంగా 30 రోజుల ప్లాన్‌ను చేర్చాలని మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. 'కంపెనీలు అందించే ప్లాన్ ఆప్షన్లలో కచ్చితంగా 30 రోజుల ప్లాన్ ఉండాలి. ఈ నిబంధనను కంపెనీలు పాటిస్తున్నప్పటికీ వాటిని వినియోగదారులకు తెలిసేలా మరింతగా మార్కెటింగ్ చేయాలని కోరుతున్నాం' అని జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు.

**ట్రాయ్ నిబంధనలు ఏం చెబుతున్నాయి?**


2022లోనే ట్రాయ్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ప్రతి టెలికాం సంస్థ ప్లాన్ వోచర్లు, ప్రత్యేక టారిఫ్ వోచర్లు, కాంబో వోచర్ల రూపంలో కనీసం ఒక 30 రోజుల ప్లాన్‌ను అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం 'టారిఫ్ ఫోర్బేరెన్స్' విధానం అమలులో ఉండటంతో ధరలు, సర్వీసు నిబంధనలు నిర్ణయించుకునే స్వేచ్ఛ ఆపరేటర్లకు ఉంది. అయినప్పటికీ, వినియోగదారులను ఇబ్బంది పెట్టకుండా ట్రాయ్ నిరంతరం పర్యవేక్షిస్తోంది.



# ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన శ్రీముఖి..

## హైదరాబాద్‌లో కొత్త రెస్టారెంట్ ప్రారంభం

టాలీవుడ్ ప్రముఖ యాంకర్, నటి శ్రీముఖి ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న క్యాపిటల్ పార్క్‌లో తన స్నేహితులు శ్రావణ్, ఆనంద్, రవిలతో కలిసి 'ఫుర్సత్ అనే రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ.. తనకు భోజనం అంటే చాలా ఇష్టమని, ముఖ్యంగా బిర్యానీ, చికెన్ కర్రీలతో పాటు వెజిటేరియన్ వంటకాలను కూడా ఆస్వాదిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ప్రశాంతంగా గడిపేలా, ఒక మంచి అనుభూతిని అందించేలా ఫుర్సత్‌ను తీర్చిదిద్దినట్లు ఆమె వివరించారు. ఈ రెస్టారెంట్‌లో సుమారు 300 మంది కూర్చునే సదుపాయంతో పాటు ప్రత్యేకమైన బ్యాంక్వెట్ హాల్స్ కూడా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నల్లి గోష్ట్ బిర్యానీ వంటి ప్రత్యేక వంటకాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని శ్రీముఖి పేర్కొన్నారు. భాగస్వాములు శ్రావణ్, ఆనంద్, రవి మాట్లాడుతూ.. రుచి, సేవలలో ఎక్కడా రాజీ పడకుండా సంప్రదాయ, ఆధునిక వంటకాల కలయికతో మెనూని రూపొందించామని చెప్పారు. కార్పొరేట్ సమావేశాలకు, కుటుంబ వేడుకలకు ఫుర్సత్ ఒక ఉత్తమ గమ్యస్థానంగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వినూత్నమైన డైనింగ్ కాన్సెప్ట్‌తో ప్రారంభమైన ఈ రెస్టారెంట్, శ్రీముఖి భాగస్వామ్యంతో హైదరాబాద్ ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



# ముందు అనుకున్నారు.. ఫైనల్‌గా ఫిక్స్ చేశారా?

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న సినిమా 'పెద్ది'.. మరో నెల రోజుల్లో థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే షూటింగ్ నడుస్తుండటంతో వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని రూమర్స్ వస్తున్నాయి. మరోవైపు చరణ్ పుట్టినరోజున ఓవర్సీస్ బుకింగ్స్ ఓపెన్ అవుతాయని అధికారికంగా ప్రకటించడంతో వాయిదా లాంటిది లేదని పరోక్షంగా క్లారిటీ ఇచ్చినట్లయింది. అయితే ఈ మూవీలోని ఐటమ్ సాంగ్ ఎవరు చేస్తారా అనే ప్రశ్న కూడా ఇంకా అలానే మిగిలిపోయింది. ఫైనల్‌గా దానికి సమాధానం దొరికేసినట్లు కనిపిస్తోంది. గతంలో 'పెద్ది' ఐటమ్ కోసం పూజా హెగ్డే, ఆయేషా ఖాన్, మృణాల్ ఠాకుర్.. ఇలా చాలా పేర్లు వినిపించాయి. కానీ పాట షూటింగ్ ఇంకా బ్యాలెన్స్ ఉండేసరికి ఎవరిని తీసుకున్నారనే విషయం బయటకు రాలేదు. చివరకు ఇప్పుడు ముందు అనుకున్న వాళ్లలో మృణాల్ ఠాకుర్‌ని ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో ఈమె హీరోయిన్‌గా చేసిన 'డకాయిట్' రిలీజ్ కానుంది. దీని ప్రమోషన్స్‌లో పాల్గొనేందుకు ప్లస్ 'పెద్ది' సాంగ్ చేసేందుకుగానూ రాబోయే కొన్నిరోజులు ఈమె హైదరాబాద్‌లోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ ఐటమ్ పాటలో చరణ్-మృణాల్‌తో పాటు జాన్వీ కపూర్ కూడా కాసేపు కనిపిస్తుందని అంటున్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ విలేజ్ డ్రామాగా తెరకెక్కించారు. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు చేశారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందించాడు. ఇప్పటికే రెండు పాటలు రిలీజ్ కాగా రెండూ సూపర్ హిట్ అయ్యాయి.



# ధనుష్‌కి జోడీగా రుక్మిణి..

తక్కువ టైంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్. సొంత భాషలో హిట్స్ ఉన్నప్పటికీ తెలుగు, తమిళంలో చేసిన చిత్రాలన్నీ డిజాస్టర్స్ అయ్యాయి. ప్రస్తుతం ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీలో హీరోయిన్‌గా చేస్తోంది. అయితే తమిళంలో చేసిన మూవీస్ ఫ్లాప్ అయినప్పటికీ.. ఇప్పుడు రుక్మిణి మరో అవకాశం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. వరుస సినిమాలతో అలరిస్తున్న తమిళ హీరో ధనుష్.. ప్రస్తుతం విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో 'కర' మూవీ చేశాడు. మమిత బైజు హీరోయిన్. వచ్చే నెల 30న థియేటర్లలోకి రానుంది. మరోవైపు 'అమరన్' తీసిన రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలోనూ ధనుష్ ఓ సినిమా చేస్తున్నాడు. డీ55 పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో సాయిపల్లవి, శ్రీలీల హీరోయిన్స్. సాయి అభయంకర్ సంగీతాన్ని అందిస్తున్నాడు. దీని తర్వాత ధనుష్ మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'లబ్బర్ పందు' ఫేమ్ తమిళసన్ పచ్చముత్తు దర్శకత్వం వహించనున్నట్లు టాక్. ఇందులోనే దక్షిణాది క్రేజీ హీరోయిన్ రుక్మిణి వసంత్.. ధనుష్ సరసన నటించనుందట. ఇదే నిజమైతే వీళ్లిద్దరి కాంబోలో రూపొందే తొలి చిత్రం ఇదే అవుతుంది. ఈ ?ప్రాజెక్టుకి అనిరుధ్ సంగీంతమందించనున్నాడట. ఇందులో ప్రతినాయకుడిగా విజయ్ కుమార్ నటిస్తారని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

# విజయ్ సేతుపతికి జోడీగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్!

చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు నటుడు విజయ్ సేతుపతి. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఎడాపెడా చిత్రాలు చేస్తున్నాడు. తెలుగులో పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నాడు. ప్రస్తుతం వెట్రిమారన్ డైరెక్షన్‌లో శింబు హీరోగా నటిస్తున్న అరసన్ చిత్రంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. అలాగే మరికొన్ని సినిమాల్లోనూ యాక్ట్ చేస్తున్న ఈయన తాజాగా మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. బాలీవుడ్ బ్యూటీ విడాముయుర్చి ఫేమ్ మగిళ్ తిరుమేణి దర్శకత్వంలో సినిమా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించనున్నట్లు భోగట్టా! ఇకపోతే ఇందులో విజయ్ సేతుపతికి జంటగా బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్‌ను నటింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ ఆఫర్‌కుగానీ ఆమె ఒప్పుకుంటే కోలీవుడ్‌లో మరో క్రేజీ కాంబో షురూ అయినట్లే! మరి ఇదెంతవరకు నిజమన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకు ఆగాల్సిందే!



# 'స్పిరిట్' భామని రంగంలోకి దించుతున్న నాని?

టాలీవుడ్‌లో మినిమం గ్యారంటీ హీరోగా పేరు తెచ్చుకున్న నాని.. ప్రస్తుతం 'ప్యారడైజ్'తో బిజీగా ఉన్నాడు. మరోవైపు 'ఓజీ' సుజీత్ దర్శకత్వంలో త్వరలో ఓ మూవీని ప్రారంభించబోతున్నాడు. ఇవి కాకుండా మరికొన్ని లైన్‌లో ఉన్నాయి. ఇలా కెరీర్ పరంగా మంచి ఫామ్‌లో ఉన్న నాని.. ఇప్పుడు ఓ బోల్ బ్యూటీతో స్క్రీన్ షేర్ చేసుకునేందుకు సిద్ధమయ్యాడట. పలు హిందీ చిత్రాల్లో నటించిన తృప్తి దిమ్రికి.. సందీప్ రెడ్డి వంగా తీసిన 'యానిమల్' మూవీ ఓవర్‌నైట్ స్టార్‌డమ్ తెచ్చిపెట్టింది. బాలీవుడ్‌లో వరస అవకాశాలు అందుకుంటూ బిజీ అయిపోయింది. ప్రస్తుతం తనకు లైఫ్ ఇచ్చిన సందీప్ వంగా తీస్తున్న 'స్పిరిట్'లో ప్రభాస్‌కి జోడీగా చేస్తోంది. మరి మెయిన్ లీడ్ లేదా సెకండ్ హీరోయిన్ అనేది తెలియాల్సి ఉంది. ఇదలా ఉండగానే ఇప్పుడు నాని చేయబోయే ఓ మూవీ కోసం తృప్తిని హీరోయిన్‌గా అనుకుంటున్నారట. ఒకవేళ ఇదే నిజమైతే తృప్తి.. టాలీవుడ్ ఎంట్రీ చిత్రం ఇదే కావొచ్చు. గత కొన్ని సినిమాలతో పాన్ ఇండియా మార్కెట్‌పై దృష్టి పెట్టిన నాని.. అందుకు తగ్గట్లే బాలీవుడ్‌లో మెల్లమెల్లగా గుర్తింపు తెచ్చుకునే పనిలో ఉన్నాడు. ప్రస్తుతం చేస్తున్న 'ప్యారడైజ్'లోనూ ఓ కీలక పాత్ర కోసం రాఘవ్ జ్యూయెల్ అనే నటుడితో కలిసి పనిచేస్తున్నాడు. ఇప్పుడు తృప్తి పేరు వినిపిస్తుంది. చూడాలి



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com